ఈనాడు
మెదక్
ఆదివారం అక్టోబరు 20, 2024

చిత్తశుద్ధితో పనిచేయాలి: కలెక్టర్


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న రాహుల్‌రాజ్

అల్లాదుర్గం: ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పనితీరుపై తీరా తీశారు. పీహెచ్‌సీలో రోగులకు చికిత్సలు, మందులు అందించే గదులు, బెడ్లు, శౌచాలయాలను పరిశీలించారు. రోగుల గురించి సిబ్బందిని అడిగారు. ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు చేయాల్సి ఉందని ప్రశ్నించారు. అనంతరం సేవలు పొందేందుకు వచ్చే రోగులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. వైద్యురాలు అశ్విని, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శంకర్, సిబ్బంది మధు, విజయరూప, నర్సమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే కొత్త

చేగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన చరవాణిలో మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఎన్నో హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులను అన్ని విధాలా మోసం చేశారన్నారు. రైతు భరోసా ఎగ్గొట్టారన్నారు. దీనిపై ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున తరలని ఆయన కోరారు.

రేపట్నుంచి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు: ఎస్పీ

మెదక్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా ఈనెల 21 నుంచి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 24 వరకు ఠాణాల్లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, యాంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్‌స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పాత్ర తదితర విషయాలను ప్రజలు, విద్యార్థులకు వివరించనున్నట్లు తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా మూడు భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరం, సైకిల్ ర్యాలీ, షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇక్కడ సైనికులకు అన్నీ ఉచితమే!



ఈ చిత్రం చూడగానే.. ఇదేదో సాధారణ హోటలే కదా.. ఏముంది విశేషం అనిస్తుంది కదూ! దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ఇక్కడికి సైనికులెవరైనా వస్తే అన్నింటినీ ఉచితంగా అందించడమే ఆ ప్రత్యేకత.

న్యూస్‌టుడే, కోహీర్

కని పెంచిన తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి దూరంగా.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి కాపలా కాస్తూ మనల్ని రక్షిస్తుంటారు సైనికులు. వారి సాహసం, త్యాగం వెలకట్టలేనివి. ఎక్కడైనా కనిపిస్తే మన మనసు ఉప్పొంగుతుంది. వారికి సెల్యూట్ చేస్తుంటాం. దేశానికి ఇంతగా సేవ చేస్తున్న సైన్యం అంటే ఆ కుటుంబానికి ప్రాణం. తమ హోటళ్లకు వచ్చే సైనికులకు అన్నింటినీ ఉచితంగా అందిస్తుండటం విశేషం. వారే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ సమీపంలోని హోటల్ నిర్వాహకులు సాను వాసుదేవ్ కుటుంబసభ్యులు.


వాసుదేవ్‌తో వైమానిక దళం సిబ్బంది

చిన్నతనంలోనే..

ఇదే జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లికి చెందిన సాను జగన్నాథం, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు వాసుదేవ్, గోవింద్, వెంకటేశం, కుమార్తె పార్వతమ్మ ఉన్నారు. జగన్నాథం కోహీర్ మండలం కొత్తూర్(డి) సమీపంలో 9వ నంబరు జాతీయ రహదారి (ప్రస్తుత ఎన్‌హెచ్ 65)లో టీ హోటల్ నడిపేవారు. పెద్ద కుమారుడు వాసుదేవ్ 1986లో ఏడో తరగతి పాసయ్యారు. అప్పట్లో తనకిష్టమైన ఆర్మీ జవాను ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీనికి ఇష్టపడని ఆతడి తల్లిదండ్రులు వాంగ్మూల పత్రంపై సంతకం చేయలేదు. వాసుదేవ్ నిర్ణయం మార్చుకొని పదేళ్లు హైదరాబాద్ సమీపంలో పండ్ల వ్యాపారం చేశారు. ఆ తర్వాత పలు కారణాలతో తిరిగొచ్చేసి హోటల్ నడిపిస్తున్నారు.

కుమారుడిదైనా..

వాసుదేవ్‌కు వెంకటమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ముగ్గురు కుమార్తెలు. కుమారుల్లో ఒకరు ఆర్మీలో చేరాలని వాసుదేవ్ ఆశించారు. పెద్ద కుమారుడు నారాయణ సరిపడా ఎత్తు లేక విఫలమయ్యారు.

ప్రత్యేకంగా స్వాగతం

8 ఏళ్ల కిందట వాసుదేవ్ తన హోటల్‌ను దిగ్వాల్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కకు మార్చారు. 65వ నంబరు జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. తమ హోటల్‌కు వచ్చే సైనికులకు ఆహారం ఉచితంగా అందించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు సైనికుల వాహనాలు వెళ్తూ తమ హోటల్ దగ్గర ఆగగానే ప్రత్యేకంగా స్వాగతం పలుకుతారు. జవాన్లు తీసుకునే అల్పాహారానికి, చాయ్, ఇతర వస్తువులకు ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఉచితంగా ఇచ్చేస్తారు వాసుదేవ్. వీరి సేవలను గుర్తించిన ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం 2019లో సత్కరించారు.


వాసుదేవ్ కుమారుడిని సన్మానిస్తున్న కోదండరాం

నిజమైన హీరోలు వారే..: వాసుదేవ్

తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైన్యమే నిజమైన హీరోలు. నా జీవిత లక్ష్యం నెరవేరకున్నా ఆర్మీ జవాన్లకు నా వంతుగా సేవ చేస్తున్నా. నేటి యువత దృఢంగా ఉండి మాతృభూమి సేవలో మమేకమవ్వాలన్నదే నా అభిప్రాయం.


ఉత్సవాలకు హాజరైన మాధవానంద, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కొప్పోల్‌లో కోటి రుద్ర పారాయణం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వరాలయంలో కోటి రుద్ర పారాయణ ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో స్వామివారికి మహా రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో కొప్పోల్ ప్రాంగణం మార్మోగింది. భక్తులు వేలాదిగా వచ్చి కోటి రుద్ర పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం ఉమాసంగమేశ్వరుణ్ని దర్శించుకున్నారు. మాధవానంద భక్తులనుద్దేశించి ప్రవచించారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టండి


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ

మెదక్ అర్బన్: ఆలయాలపై దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ మహేందర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఆలయాలు, పండగలపై జరిగిన దాడులపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించాలన్నారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కాజ్ సత్యనారాయణ, విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం, జిల్లా కోశాధికారి ఎర్ర ముత్యాలు, జిల్లా కార్యదర్శి నీలశం, పట్టణ అధ్యక్షుడు అరవింద్‌గౌడ్, మాతృశక్తి సంయోజక అనంతలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్, న్యూస్‌టుడే: స్తంభాలు, తీగలు, మరమ్మతుల పనుల కారణంగా ఆదివారం మెదక్ పట్టణంలో విద్యుత్తు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నవీన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ముత్యాలమ్మ ఆలయం, చమాన్ ప్రాంతాల్లో మరమ్మతు పనుల కోసం బారాహిమాం పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

ఉపాధి కోర్సులలో శిక్షణ

మెదక్, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకులకు స్థానిక వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్, సీసీ టీవీ రిపేర్-అమరిక కోర్సు, కంప్యూటర్ హార్డ్‌వేర్, మొబైల్ సర్వీసింగ్-రిపేర్, ఎలక్ట్రికల్ (హౌస్ వైరింగ్), మగ్గం వర్కులలో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 21లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 73963-13741 చరవాణిలో సంప్రదించాలన్నారు.

ప్రజల చెంతకే న్యాయ సేవలు

హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

అల్లాదుర్గం: ప్రజల చెంతకే న్యాయసేవలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. శనివారం అల్లాదుర్గంలో కొత్త కోర్టు సముదాయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొత్తగా కోర్టు రావడంతో ఈ ప్రాంత ప్రజలకు సత్వర న్యాయసేవలు అందుతాయన్నారు. రేగోడు, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. ‘మా తాత, ముత్తాతలది చిన్నశంకరంపేట పరిధి కామారం. ఈ ప్రాంత వాసిగా కోర్టు ప్రారంభించడం ఆనందంగా ఉంది’ అన్నారు. అంతకుముందు కలెక్టర్ రాహుల్‌రాజ్ పుష్పగుచ్ఛం అందించారు. పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.


జిల్లా న్యాయస్థానాల సముదాయం వద్ద జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, న్యాయమూర్తులు జితేందర్, రీటా లాల్‌చంద్, బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు

వైద్యసేవలు అందుబాటులోకి రావడం శుభపరిమాణం..

మెదక్ అర్బన్: జిల్లా న్యాయస్థానాల సముదాయంలో వైద్య సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మెడికల్ డిస్పెన్సరీని ప్రారంభించి మాట్లాడారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పోలీసుల గౌరవవందనం స్వీకరించారు.

న్యాయమూర్తులను నియమించండి..

కోర్టు భవనం, గ్రంథాలయం, న్యాయవాదులకు క్వార్టర్స్ నిర్మించాలని, న్యాయమూర్తులను నియమించాలని మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రగౌడ్ బాధ్యులతో కలిసి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం చర్చికి వచ్చిన జడ్జికి ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, మత గురువు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

పాపన్నపేట: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద ఈవో చంద్రశేఖర్, అర్చకులు, సిబ్బంది జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో ఈవో అమ్మవారి చిత్రపటం అందించి సత్కరించారు. అంతకుముందు హరిత హోటల్ వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

శ్రద్ధగా చదివితే లక్ష్య సాధన: డీఈవో


మాట్లాడుతున్న రాధాకిషన్

పాపన్నపేట, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు శ్రద్ధతో చదివి జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి, కుర్తివాడ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను తరచూ గమనించాలన్నారు. ఏదైనా మార్పు కనిపిస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇళ్ల వద్ద విద్యార్థులు చదువుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు దేవయ్య, శివశంకర్, కిషన్ ఉన్నారు.

ధాన్యం.. వర్షార్పణం


– న్యూస్‌టుడే, మెదక్

తరచూ కురుస్తున్న వర్షం అన్నదాతను కుదిపేస్తోంది. కోతలు అయ్యాక పట్టణంలోని పిల్లికొట్టాల్ కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో తడిచింది. నీటిలో కొట్టుకుపోతుండగా అన్నదాతలు ఒకచోటికి చేర్చారు. తిరిగి ఆరబెట్టేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.

నిర్వాసితుల సమస్యలపై చర్చించాలి

ములుగు, గజ్వేల్: మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల సమస్యలపై చర్చించేందుకు మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఆర్ అండ్‌ఆర్ కాలనీకి ఎప్పుడు వస్తారో చెబితే.. అదే సమయానికి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తామని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శనివారం వంటిమామిడి, అక్కారంలో ఆయన మాట్లాడారు. జలాశయాల నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన భూనిర్వాసితులకు భారాస ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం తారుమారు

అధ్వానంగా మారిన రహదారి


మూసాపేట- ఎల్లారెడ్డిగూడ తండా మధ్య దెబ్బతిన్న తారు రోడ్డు

న్యూస్‌టుడే, నర్సాపూర్: తారు రోడ్డు పనుల్లో నూతన సాంకేతికత వినియోగించారు. ప్రయోగాత్మకంగా పనులు చేశారు. చివరికి అది ఫలించకపోవడంతోపాటు రహదారి అధ్వానంగా మారింది. అయిదు కి.మీ. పొడవున తారు తొలగి రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

చిప్పల్‌తుర్తి నుంచి మూసాపేట దాకా.. మండలంలోని చిప్పల్‌తుర్తి నుంచి వయా ఎల్లారెడ్డిగూడెం తండా మీదుగా మూసాపేట వరకు 2021లో రూ.2.80 కోట్లతో తారు రోడ్డు వేశారు. అంతకుముందు మట్టి దారి కావడంతో తారు వేస్తే ఇబ్బందులు తొలగుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. నిధులు కేటాయించినా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం ఆయా ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. ఈ రోడ్డును పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వ సూచనల మేరకు ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇతర రోడ్లకు భిన్నంగా నిర్మించారు. వ్యవసాయ భూములు కావడంతో మెటల్ తక్కువై రోడ్డంతా చాలా చోట్ల కుంగిపోయింది. లోతైన గోతులు ఏర్పడ్డాయి. నిర్వహణ కరవై అధ్వానంగా తయారైంది. వాహనాల టైర్లు పాడవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం...

– రాధికాలక్ష్మి, పీఆర్, డీఈ

ప్రయోగాత్మకంగా వేసిన రోడ్డు అధ్వానంగా మారింది. గతంలోనూ పలుమార్లు మరమ్మతులు చేయించాం. త్వరలో రూ.కోటి నిధులతో మరమ్మతులు చేయిస్తాం. కేజీవీల్స్ తిరగడంతో రహదారి ధ్వంసమైంది.

మంత్రాల నెపంతో దాడి.. 12 మందిపై కేసు

తూప్రాన్, న్యూస్‌టుడే: మంత్రాలు చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురిపై దాడిచేసిన విషయంలో 12మందిపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన స్వామి తండ్రి పోచయ్య కొన్ని నెలల కిందట మృతిచెందాడు. శనివారం పెద్దలకు చేస్తుండగా ‘మీ తండ్రి ఆత్మ మా ఇళ్లల్లో తిరుగుతోంది’ అని ఆరోపిస్తూ, గ్రామానికి చెందిన 12మంది స్వామి, ఆయన తల్లి కమలమ్మ, అడ్డుకోబోయిన భార్య నవనీతపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బాధితుడు స్వామి ఫిర్యాదుతో 12మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చేగుంట: కారు ఢీకొన్న ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో శుక్రవారం రాత్రి సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే చేగుంట ఠాణాలో సంప్రదించాలన్నారు.

21న ఐటీఐ అప్రెంటిస్‌షిప్ మేళా

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఐటీఐలలో ఆయా కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెదక్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 21న అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు మెదక్ ఐటీఐ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులపీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యాసంగికి తప్పని గోస

అసంపూర్తిగా పంట కాలువలు

న్యూస్‌టుడే– చేగుంట, మిరుదొడ్డి, దుబ్బాక

గోదావరి నీటిని చెరువుల్లోకి మళ్లించాలన్న నీటిపారుదల శాఖ లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో ఏటా ఆయకట్టు రైతులకు సాగునీటికి కటకట తప్పడం లేదు. యాసంగి సీజన్‌కు అన్నదాత సిద్ధమవుతున్నా.. సాగునీరందించే పంట కాలువలు మాత్రం అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల ప్రధాన కాలువల నుంచి మిరుదొడ్డి, దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, చేగుంట, నార్సింగి, చిన్న శంకరంపేట, రామాయంపేట మండలాల్లోని చెరువుల్లో గోదావరి నీటిని నింపడానికి నిర్మిస్తున్న ఉప కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో 40వేల ఎకరాలకుపైగా సాగు చేసేందుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.


చేగుంట: పూర్తికాని కొండపోచమ్మ సాగర్ కాలువ


చెరువులు నింపేందుకు..

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ 12, 13వ ప్యాకేజీల ద్వారా దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల్లోని రైతులకు సాగునీరు అందించే ఉపకాలువ పనులు అర్ధాంతరంగా నిలిచాయి. నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. మల్లన్నసాగర్ కాలువకు సంబంధించి నాలుగేళ్ల కిందట దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్ నుంచి చెల్లాపూర్, మల్లాయపల్లి, కుమ్మర్‌పల్లి, పోతారం, అచ్చుమాయిపల్లి, గంభీర్‌పూర్ వరకు 30,826 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 14.5 కి.మీ.మేర 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మించడానికి నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఉప కాలువ పనులను 7.8 కి.మీ.మేర మాత్రమే చేశారు. 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ పనుల్లో భాగంగా ఆరు చోట్ల డబుల్ లైన్ రోడ్ బ్రిడ్జి(డీఎల్ ఆర్బీ), 7 చోట్ల సింగిల్ లైన్ రోడ్ బ్రిడ్జి(ఎస్ఎల్ ఆర్బీ) నిర్మించారు. చెల్లాపూర్, మల్లాయపల్లి, కమ్మర్‌పల్లి మధ్య కాలువ పనులు కొన్నిచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు కేవలం రూ.4- 4.5 లక్షలు మాత్రమే ఇస్తుండడంతో కొందరు చెక్కులు నిరాకరిస్తున్నారు. దీంతో కమ్మర్‌పల్లి, పోతారం మధ్య 3.5 కి.మీ. కాలువ పనులు పెండింగులోనే ఉన్నాయి. దౌల్తాబాద్ మండలంలో దొమ్మాట, గాజులపల్లిలోని బొమ్మ చెరువు, పెద్ద చెరువు, పటేల్ చెరువు, కనక చెరువు, కోమటి చెరువు, దాచారం కుంట, తుమ్మచెరువుల్లో గోదావరి నీటిని నింపడానికి నిర్మించతలపెట్టిన ఉపకాల్వల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో కొండాపూర్, ధర్మారం, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, అల్మాస్‌పూర్ చెరువులు నింపడానికి నిర్మించతలపెట్టిన ఉప కాలువలు అసంపూర్తిగా మారాయి.

గొల్లపల్లి వరకే సాగునీరు

- చేగుంట మండలం గొల్లపల్లి, రాంపూర్, కరీంనగర్, రుక్మాపూర్, చిట్టోజిపల్లి, భీంరావుపల్లి, రెడ్డిపల్లి, వల్లూరు మీదుగా చిన్న శంకరంపేట చెరువుల్లో నీరు నింపడానికి చిన్నశంకరంపేట కెనాల్ ద్వారా 55 కి.మీ.మేర ఉప కాలువల పనులు చేపట్టారు. రాంపూర్ శివారులోని చెరువు భూగర్భం నుంచి గోదారి నీటిని సరఫరా చేయడంతో గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో కేవలం గొల్లపల్లి వరకు మాత్రమే ఉప కాలువల ద్వారా సాగునీరు వెళుతోంది. రాయపోల్ మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, సయ్యద్‌నగర్ చెరువులను నింపటానికి 10 కి.మీ.మేర ఉపకాలువల నిర్మాణానికిగాను 7 కి.మీ. మాత్రమే పనులు పూర్తయ్యాయి. తొగుట మండలం తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్‌లో ఉపకాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

'బలగం' నటి కొమురమ్మకు స్పీకర్ రూ.లక్ష ఆర్థిక సాయం



వికారాబాద్, న్యూస్‌టుడే: 'బలగం' సినిమాలో నటించిన కొమురమ్మకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వేతనం నుంచి రూ.లక్ష విరాళం హైదరాబాద్‌లోని అధికార నివాసంలో శనివారం అందించారు. దంపతులైన కొమురమ్మ, మొగిలయ్యలు ఇటీవల ఓ సభలో స్పీకర్‌ను కలిసి ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించారు. చలించిన ఆయన రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నారు.

క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జూబ్లి క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఉంటుందని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1, 2001 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో.. సాంకేతికత

న్యూస్‌టుడే, మెదక్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో వరి ఎక్కువగా సాగవుతోంది. ఈ మేరకు ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగాలు సన్నద్ధమయ్యాయి. కోతలు షురూ కావడంతో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం సన్న రకం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా సన్నాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనుండటం విశేషం.

నాలుగు జిల్లాల్లో ఇలా..

	ధాన్యం దిగుబడి (లక్షల మె.ట.ల్లో..)	కొనుగోలు కేంద్రాలు
మెదక్	7.49	483
సంగారెడ్డి	3.18	211
సిద్దిపేట	9.0	417
వికారాబాద్	1.0	107

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 8,99,369 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్నాల సాగే ఎక్కువగా ఉంది. కొందరు దొడ్డు రకం సైతం పండించారు. ఈ క్రమంలో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆయా పరికరాల వినియోగంపై వివిధ జిల్లాల్లో వ్యవసాయ, సహకార, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు.

సన్నాలు గుర్తించేలా..



సన్న రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సేకరణలో అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. నాణ్యతతో పాటు సన్న ధాన్యం గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్రానికి రెండు డిజిటల్ పరికరాల చొప్పున కేటాయిస్తున్నారు. ఈ యంత్రంలో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. నిర్దేశిత ప్రమాణాలు ఉంటేనే కొంటారు. సంచుల్లో ధాన్యాన్ని నింపాక సులువుగా గుర్తించేలా సన్నాలకు ఎరుపు, దొడ్డు రకానికి ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

వడ్లు ఒలిచేందుకు..



సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరంలో వడ్లను ఒలిచి బియ్యాన్ని మాత్రమే వేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత శ్రమ అవసరం. సులభంగా వడ్లు ఒలిచేందుకు ప్యాడి హస్కర్ యంత్రాన్ని అందిస్తున్నారు. ఇందులోకి కొంత ధాన్యాన్ని వేసి తిప్పితే వడ్ల పొట్టు తొలగిపోయి బియ్యంగా మారుతాయి. వాటిలో నుంచి ఓ గింజను గ్రెయిన్ కాలిపర్‌లో వేసే సరిపోతుంది.

ధ్రువీకరించాకే..:



సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. సన్నాలను కొత్త పరికరం ద్వారా గుర్తించి వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. దళారుల ప్రమేయం తగ్గించడానికి ఐరిస్ విధానం దోహదపడుతుంది. ఆయా వాటిపై అధికారులకు శిక్షణ ఇచ్చాం. పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. **హరికృష్ణ, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, మెదక్**

పక్కదారి పట్టకుండా..



రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయం సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకొని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో ఐరిస్ వినియోగిస్తారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఆటల్లో గెలుపోటమలు సహజమని, వాటి ద్వారా మానసిక, శారీరక దృఢత్వం చేకూరుతుందని మెదక్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి (డీవైఎస్‌వో) దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియ ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్), సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ (ఎస్‌సీఎఫ్‌ఏ) సంయుక్తంగా చేపట్టిన ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణిస్తే పలు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులు విష్ణుతేజ మాట్లాడారు. అండర్-13, 15, 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు కొనసాగాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి మొత్తం 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఐకేఎఫ్ స్కౌట్ వినోద్‌కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, ప్రశాంత్, వినయ్, ధను తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్ల ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హాకీ అండర్- 14, 17 ఎంపికలు కంది ఐఐటీహెచ్‌లోని డీపీవీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొటారని పేర్కొన్నారు.

అన్నదాత ప్రాణాలు తీసిన ఇనుప కంచె



యాదయ్య

వెల్దుర్తి: అడవి పందుల నుంచి రక్షణకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు సరఫరా అవుతున్న ఇనుప తీగలకు తగిలి రైతు మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దురిత్త ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని యశ్వంతరావుపేటకు చెందిన గుండెని యాదయ్య(46) పొలం అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉంది. అడవి పందుల బారి నుంచి రక్షణగా పొలం చుట్టూ ఇనుప కంచె బిగించాడు. శుక్రవారం రాత్రి యాదయ్య భోజనం చేసి పంట కాపలాకు పొలానికి వెళ్లాడు. కంచెకు విద్యుత్తు సరఫరా కల్పించి నిద్రించాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన చుట్టుపక్కల రైతులు గమనించగా.. ఇనుప కంచె తగిలి యాదయ్య మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శనివారం యాదయ్య భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత



శ్రీనివాస్

నార్సింగి(చేగుంట): చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీట మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) వ్యవసాయం చేస్తుంటాడు. స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశాడు. శనివారం ఉదయం వెళ్లగా వెళ్లి ప్రమాదవశాత్తు వల చిక్కుకొని నీట మునిగి మృతిచెందాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. శ్రీనివాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. కేసు నమోదైంది.


ట్రాక్టర్ బోల్తా పడి మహిళ దుర్మరణం



సాయమ్మ

కౌడిపల్లి: ట్రాక్టర్ బోల్తాపడి మహిళ దుర్మరణం పాలైంది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధి భుజరంపేట పరిధి వెంకటాపూర్‌కు చెందిన బడిగంటి సాయమ్మ(54). . శనివారం ఇంటి నిర్మాణానికి కౌడిపల్లి నుంచి ట్రాక్టర్లో డస్ట్ తీసుకెళుతుండగా.. శివారులోని కూకుట్లపల్లి రోడ్డుపై మల్లుకుంట శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న సాయమ్మ డస్ట్‌లో కూరుకుపోయి చనిపోయింది. డ్రైవర్ యాదాగౌడ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వాహనం ఢీకొని వృద్ధుడు..



నారాయణ

మిరుదొడ్డి: వాహనం అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాలు.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన పర్స నారాయణ(66) రహదారి పై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి అదుపుతప్పి వెనుక నుంచి నారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి

జిన్నారం, న్యూస్‌టుడే: పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. ఐడీఏ బొల్లారం పోలీసులు, పరిశ్రమ వర్గాల తెలిపిన వివరాలు.. సెల్‌మార్ ల్యాబరేటరీ పరిశ్రమలో పదిలం రాజేశ్ (31) ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో విధులకు వచ్చిన ఆయన చిల్లింగ్ ప్లాంటు బ్రెయిన్ సంపులో పడి మృతి చెందాడు. ఆ సమయంలో ఎవరూ చూసి ఉండకపోవచ్చని చెబుతున్నారు. భద్రాచలం ప్రాంతంలోని కొత్తగూడెంకు చెందిన రాజేశ్ గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా సూరారంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, చిన్న పాప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్ పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అనుమానాలు ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు.

నీతులు చెప్పాల్సిన నోటితో బూతులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పిల్లలకు నీతులు చెప్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఒకరు ఇటీవల బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరినప్పటి నుంచి విద్యార్థులను మాటలతో హింసించడంతో పాటు మూత్రశాలకు వెళ్లినా తిడుతున్నాడంటూ పలువురు తమ తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బడికి రావాలంటే పిల్లలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణిలకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. ఎంఈవో పాఠశాలకు వచ్చి వారితో మాట్లాడి ఆరా తీశారు. వాస్తవమని తేలడంతో మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్‌ఎంను హెచ్చరించారు. ఇకనుంచి ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఒత్తిడి లేకుండా విధులు నిర్వహిస్తేనే ఆరోగ్యం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ సూచించారు. అప్పుడే అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ఒత్తిడి అధిగమించడంపై సిద్దిపేట కమిషనరేట్‌లో అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కమిషనరేట్ ఏవో యాదమ్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగయ్య

గజ్వేల్ గ్రామీణ: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగదేవపూర్ మండలం కొల్గుర్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. కొల్గుర్‌కు చెందిన బండారి లింగయ్య(55) గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతని భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెంది.. జీవితంపై విరక్తితో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేములఘాట్‌కు చెందిన కంటి ప్రభాకర్(22) ఆటో నడుపుతు జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటుపడి ఆరు నెలల క్రితం ఆటో అమ్మేశాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. చనిపోతున్నట్లు ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన కొందరు హుటాహుటిన ఇంటికి చేరుకొని గడియ పగలగొట్టి లోపలికి వెళ్లి కిందికి దించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఆర్వీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఉద్యాన పంటలను మరింత ప్రోత్సహించాలి



మంత్రి తుమ్మలను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపేలా కార్యక్రమాలు అమలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా నూతనంగా నియమితులైన దండా రాజిరెడ్డి శనివారం రాత్రి హైదరాబాదులో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వీసీతో పలు అంశాలపై చర్చించారు.

ప్రమాదానికి గురైన కారు.. పట్టుబడిన గంజాయి

80 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఎండు గంజాయి బస్తాలు పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురైన కారులో భారీగా గంజాయిని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు జాతీయ రహదారిపై రామాయంపేట శివారులోకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు కారును గుర్తించి తనిఖీ చేయగా.. గంజాయి బస్తాలు బయటపడ్డాయి. ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వచ్చి కారు డిక్కీలో ఉంచిన నాలుగు బస్తాల్లోని 80 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

చికిత్స పొందుతూ బావ బామ్మర్దులు మృతి

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో శుక్రవారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ తండాకు చెందిన లావుడ్యా వాగ్యా(30), అతని బావ భూక్య రాజు(46) ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్‌లుగా బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో పనులు ముగించుకుని వాహనంలో ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులోని చేపలకాలనీ వద్ద పార్కింగ్ ఇండికేటర్స్ వేయకుండా, నిర్లక్ష్యంగా రోడ్డు మీద ఆపిన లారీని గమనించక వెనక నుంచి ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు, పోలీసులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లక్ష్మీపతిగూడెంలో పట్టపగలే చోరీ

జిన్నారం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని దుండగులు శనివారం పట్టపగలు లక్ష్మీపతిగూడెంకు చెందిన జనార్దన్ ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.40 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు వాపోయారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ఆధారంగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగలక్ష్మి పేర్కొన్నారు.

'సైక్లింగ్'లో సిద్దిపేట జిల్లా క్రీడాకారుల సత్తా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-18 బాలికల విభాగంలో టైమ్ ట్రయల్ 500 మీటర్ల అంశంలో కె.హర్షిత (హుస్నాబాద్-ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) తృతీయ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో రిజ్వానా బేగమ్ (సిద్దిపేట-ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల) నాలుగో స్థానంలో నిలిచారని జిల్లా సైక్లింగ్ అకాడమీ శిక్షకుడు సంజీవ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ ఆర్య, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనర్సయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

గురుకులంలో కాగ్నిజెంట్ శిక్షణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న కాగ్నిజెంట్ డిప్యూటీ జీఎం శ్రీనివాస్ కుప్ప

వర్గల్, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కాగ్నిజెంట్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ కుప్ప పేర్కొన్నారు. శనివారం వర్గల్ మహాత్మ జ్యోతి బాపులే బీసీ డిగ్రీ మహిళా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 23న తృతీయ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు గచ్చిబౌలి కాగ్నిజెంట్ సంస్థను సందర్శించి అక్కడి నిర్వాహకులతో నైపుణ్య శిక్షణ పొందనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ గోవిందరావు, సంస్థ ప్రతినిధులు, విద్యాలయం ప్లేస్‌మెంట్ నిర్వాహకులు రాధ, నిఖిత పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి



సత్యనారాయణ స్వామి వ్రతపూజలో భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చాకరిమెట్లలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన చేపట్టారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ప్రధాన పూజారి దేవదత్త శర్మ తదితరులున్నారు.

ఉపాధితోనే వలసల నివారణ

న్యూస్‌టుడే, నారాయణఖేడ్



తల్లిదండ్రుల వెంట చిన్నారులు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతం. ఇక్కడ 188 వరకు తండాలు ఉండగా, 50 వేలకు పైగా గిరిజనులు నివసిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా పరిశ్రమలు లేకపోవడం గమనార్హం. దీంతో యువత, ఇతర వర్గాల వారికి సరైన ఉపాధి దొరక్క వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇక చెరకు నరికే సీజన్ వచ్చిందంటే చాలు.. ఈ ప్రాంతంలోని తండాలన్నీ ఖాళీ అవుతాయి. వృద్ధులు, చిన్నారులు మాత్రమే కనిపిస్తారు. చెరకు నరికేందుకు కుటుంబమంతా వలస వెళ్లడమే ఇందుకు కారణం.

పంటలు నష్టపోవడంతో..

ప్రతి ఏటా నవంబరులో చక్కెర కర్మాగారాలు తెరచుకుంటాయి. చెరకు చేతికొచ్చే సమయం కావడంతో ఈ పనికి నారాయణఖేడ్ ప్రాంతీయులంతా వెళ్తుంటారు. ఇందుకు చక్కెర కర్మాగారాలు, చెరకు తోటల యజమానుల నుంచి అడ్వాన్స్‌గా డబ్బు ముందుగానే తీసుకుంటుంటారు. గిరిజనుల్లో అత్యధికంగా వలసలతో పాటు వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాలతో 40 శాతానికి పైగా పంటలు నష్టపోయాయి. స్థానికంగా పనులు దొరికే అవకాశం అంతంతే. ఈ తరుణంలో బతుకుబండిని నడిపించేందుకు వలస బాట పట్టని పరిస్థితి నెలకొంది. దీంతో వలస వెళ్లే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థులు సైతం..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది సుమారు 3 వేల మందికి పైగా తల్లిదండ్రుల వెంట వలస వెళ్లారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,500 మందికి 250 మంది వరకు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 300 మందికి 180 మంది వరకు వలస వెళ్లారు. చెరకు కోత సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు నాలుగు నెలల పాటు చదువుకు దూరమయ్యారు. ఈ సారి ఇదే పరిస్థితి ఎదురుకానుంది.

దృష్టిసారిస్తే..

తండాల్లోనే ఉపాధి హామీతో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసల నివారణ సాధ్యమవుతుంది. ఇందుకు ఇప్పటి నుంచే జిల్లా యంత్రాంగం ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. ఏయే తండాల నుంచి ఎంతమంది వలస వెళ్లే అవకాశం ఉంది, నివారణకు ఏయే పనులు చేపట్టాలి, వెళ్లక తప్పని పరిస్థితులున్న కుటుంబాలు ఎన్ని తదితర విషయాలను సేకరించి కార్యాచరణ రూపొందించాలి. ఇక పిల్లలను వెంట తీసుకెళ్లకుండా చూపాల్సిన చొరవపై దృష్టిసారిస్తే కొంతవరకైనా మార్పు సాధ్యం.

యోగాలో బాలికలు అదుర్స్

న్యూస్‌టుడే, చేర్యాల



యోగాసనాల ప్రదర్శనలో చిన్నారులు

యోగా.. శారీరక, మానసికపర సమన్వయానికి ఏకైక సాధనం. ప్రసుతం పట్టణాల నుంచి పల్లెల వరకు, పిల్లల నుంచి వృద్ధుల వరకు నిత్యం సాధన చేస్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా దీన్ని ప్రాధాన్యాన్ని గుర్తించగా, ఐక్యరాజ్య సమితి జూన్ 21న ప్రత్యేకంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను నిర్వహిస్తున్న విషయం విదితమే. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో దీన్ని చేర్చడంతో పిల్లలు నేర్చుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ క్రమంలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.సాత్విక, పి.అవంతిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వచ్చే నెల రెండో వారంలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత నిత్యం సాధన చేయించడంతో ఈ స్థాయికి చేరడం విశేషం.

ప్రయోజనాలు తెలియజేసి..:



పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీలతో పాటు యోగా సాధన చేయిస్తున్నాం. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ యోగా పోటీల్లో పాఠశాల నుంచి ఇద్దరు అమ్మాయిలు జాతీయ స్థాయి ఎంపికవడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలోనూ పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు.

ఎం.కవిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు

నిత్యం సాధనతో..



పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నిత్యం సాధన చేయించారు. ఏ ఆసనం ఎలా వేయాలో నేర్పించారు. ప్రతి రోజూ ఇంట్లోనూ సాధన చేశాం. పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సహించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాం. **ఎం.సాత్విక, 8వ తరగతి**

ఇంటి వద్ద నేర్పిస్తూ..:



రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. మేము నేర్చుకున్న ఆసనాలను ఇంటి వద్ద మా తల్లిదండ్రులకు, పక్కింటి వారికి సైతం నేర్పిస్తున్నాం. యోగాతో కలిగే ప్రయోజనాలు తెలియడంతో ఆసక్తి పెరిగింది. **పి.అవంతిక, 7వ తరగతి**

వ్యవసాయ పనుల్లో పురోగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాసరావు

చేగుంట, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులను గుర్తించి వాటిని చేపట్టాలని డీఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వ్యవసాయ సంబంధ పనులైన పండ్ల తోటల పెంపకం, నీటి గుంతలు, ఫిష్ పాండ్స్ నిర్మాణాలను ప్రతి పంచాయతీలో చేపట్టేలా చూడాలన్నారు. వచ్చే మార్చి 31 వరకు పనులు పూర్తి చేసి పురోగతి సాధించాలన్నారు. ఉపాధి హామీ పనులను గుర్తించి వాటి ప్రణాళికలు గ్రామసభలో ఆమోదం తీసుకోవాలన్నారు. అదనపు డీఆర్డీవో రాఘవాచార్యులు, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్, ఏపీవో శ్వేత తదితరులున్నారు.

చదువుకు దూరం చేస్తున్న ప్రభుత్వం: ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

మెదక్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కుట్ర చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆరోపించారు. శనివారం మెదక్ పట్టణం కేవల్ కిషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఆరేళ్లుగా రూ.8వేల కోట్లకు పైగా ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రీయంబర్స్‌మెంట్ ఫీజులు విడుదల చేయక ప్రైవేటు యాజమాన్యాలు పాఠశాలలు, కళాశాలలను మూసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, వ్యకాసం జిల్లా కార్యదర్శి మల్లేశం, ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు తదితరులున్నారు.

చెరువుకు బుంగ.. తప్పిన ప్రమాదం

మనోహరాబాద్: కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు గ్రామాల్లో జల వనరులు నిండుకుండల్లా మారడంతో చెరువు కట్టలు బలహీనవుతున్నాయి. మండలంలోని కాళ్లకల్ ఊర చెరువు కట్టకు బుంగ పడింది. సమాచారం పంచాయతీ కార్యదర్శి రాజుకు తెలియడంతో గ్రామస్థుల సాయంతో జేసీబీతో బుంగకు మట్టిపోసి కట్టను పటిష్టం చేశారు.

సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ వాయిదా

మెదక్ అర్బన్: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్-యూనిటీ కప్ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఔదార్యం చాటిన ఉపాధ్యాయురాలు

చేగుంట, న్యూస్‌టుడే: మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలు వసంత రూ.లక్ష విరాళం ఇచ్చేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రజనకు ప్రవీణ్‌కుమార్ అన్నారు. తన వంతు సహాయం చేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు.

అస్తవ్యస్తంగా ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణ

నిధులున్నా ప్రారంభం కాని పనులు

న్యూస్‌టుడే, కౌడిపల్లి:



శిథిల భవనంలో విధులను నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది

ఏళ్లనాటి పెంకుటింట్లో ఆరోగ్య ఉపకేంద్రంలో భయం మధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సొంత భవనానికి నిధులు మంజూరైనా నిర్మాణం చేపట్టని దుస్థితి. పైకప్పు కట్టెలతో పెంకులతో ఉండగా ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇంత అస్తవ్యస్తమైన పరిస్థితి ఉన్నా పట్టించుకునే వారే కరవయ్యారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది విధిలేని పరిస్థితిలో కౌడిపల్లి మండలం భుజిరంగపేట ఆరోగ్య కేంద్రంలో విధులను నిర్వహిస్తున్నారు. ఐదు గ్రామ పంచాయతీలు, గిరిజన తండాలకు కేంద్రమైన ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి గదిలో సేవలు:

భుజిరంపేట పంచాయతీ కేంద్రంగా ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీని పరిధిలో కూకుట్లపల్లి, భుజిరంపేట, వెంకటాపూర్(బి), పీర్యాతండా, మనంతయపల్లి తండా గ్రామ పంచాయతీలతో పాటు వాటి పరిధిలోని గిరిజన తండాలకు ఇక్కడ నుంచే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేక గ్రామంలోని పురాతన పంచాయతీ భవనాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికే వాసాలు, దూలాలు ఊడిపోయి పెంకులు సైతం కింద పడ్డాయి. గది బయట వరండాలో సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. ఉపకేంద్రంలో మందులతోపాటు ఇతరత్రా పరికరాలను ఉంచారు. ఆరోగ్య కేంద్రాన్ని పల్లె దవాఖానాగా మార్చడంతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు ఇక్కడి కేంద్రంలో భయాందోళన మధ్యే విధులు నిర్వహిస్తున్నారు.

సొంత భవనానికి రూ.20లక్షలు మంజూరు

ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి రూ.20లక్షలు నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయానికి సమీపంలో ప్రభుత్వ స్థలం ఉండడంతో 2023 జూన్ నెలలో నిర్మాణం కోసం హడావిడిగా శిలాఫలకం వేశారు. గ్రామానికి చెందిన వ్యక్తికి టెండర్ ఖరారు కావడంతో శిలాఫలకం వేసిన తర్వాత నిర్మాణం కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం తరఫున మార్క్‌వుట్ సైతం ఇచ్చారు. 18 నెలలు దాటినా కూడా పనులు శిలాఫలకం వరకే పరిమితమైంది. టెండర్ పొందిన వ్యక్తి ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం కష్టమంటూ పనులు చేసేందుకు వెనుకాడుతున్నాడని తెలుస్తోంది.

పనులు జరిగేలా కృషి చేస్తాం:

– అమరేశ్వర్, పంచాయతీరాజ్ డీఈ, కౌడిపల్లి సబ్ డివిజన్

భుజిరంపేట ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవనం కోసం గతంలోనే మార్క్‌వుట్ ఇచ్చాం. నిర్మాణం చేసేందుకు గుత్తేదారు ఆలస్యం చేస్తున్నారు. నిర్మాణానికి కావలసిన స్థలం గుర్తించి ఇప్పటికే శిలాఫలకం సైతం వేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని గుత్తేదారుతో మాట్లాడి త్వరగా పనులు చేసేలా కృషి చేస్తాం.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

మెదక్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం మెదక్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక సరస్వతీ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు-సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఖతీజాఫుల్ కుబ్రా(10వ తరగతి) ప్రథమ, పి.చైత్ర(8వ తరగతి) ద్వితీయ, బి.శివాత్మిక (9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రిన్సిపల్ సుమిత్ర బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు పద్మలత, కల్పన, విజిత, జమీమ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ సుమిత్ర, ఉపాధ్యాయులు

'రైతు డిక్లరేషన్ బుట్టదాఖలు చేసిన ప్రభుత్వం'

పెద్దశంకరంపేట, నర్సాపూర్, రామాయంపేట, శివ్వంపేట, న్యూస్‌టుడే: ఆచరణ సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను నిలువునా మోసం చేస్తోందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వానాకాలం పంటకు రైతు భరోసా ఇవ్వమని ప్రకటించడంపై భారాస నాయకులు నిరసనకు దిగారు. శనివారం పెద్ద శంకరంపేట బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వచ్చే అన్ని ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, భారాస పట్టణాధ్యక్షుడు రాఘవులు, సురేష్‌గౌడ్, రమేష్, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసాపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నర్సాపూర్‌లో భారాస నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. భారాస మండలాధ్యక్షుడు బోగ శేఖర్, మాజీ జడ్పీటీసీ బబ్యానాయక్, మాజీ ఆత్మ ఛైర్మన్ శివకుమార్, నాయకులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రవి తదితరులున్నారు. నిజాంపేటలో నాయకులు ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. సుధాకర్‌రెడ్డి, అబ్దుల్, సంపత్, రాజు పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని శివ్వంపేట భారాస మండలాధ్యక్షుడు రమణగౌడ్ తెలిపారు.



పెద్దశంకరంపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తూ..



నర్సాపూర్‌లో భారాస నాయకులు ఆందోళన

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య



ఎల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో తారాసింగ్

నర్సాపూర్ రూరల్, మనోహరాబాద్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని నర్సాపూర్ మండల విద్యాధికారి తారా సింగ్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లాపూర్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్కారు బడుల్లో ఉన్నత ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింగం పాల్గొని తల్లితండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

అట్టహాసంగా ఎన్‌సీసీ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ఆర్మీ అధికారులు

మెదక్ టౌన్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సంగారెడ్డి ఆర్మీ అధికారులు మహేష్‌బచత్, గురుప్రీత్ సింగ్‌ల పర్యవేక్షణలో శనివారం నిర్వహించిన ఎన్‌సీసీ ఎంపికలు అట్టహాసంగా సాగాయి. మొత్తం 200మంది విద్యార్థులు పాల్గొనగా 100మందిని ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ హుస్సేన్, ఎన్‌సీసీ అధికారి సురేందర్‌రావు మాట్లాడుతూ.. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ద్వారా ఆర్మీ, పోలీసు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర ఉద్యోగాలకు అర్హత పొందవచ్చన్నారు.

పాఠశాల నిర్వహణపై తల్లిదండ్రుల ఆగ్రహం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పేట ఆదర్శ పాఠశాల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో కనీస వసతులు కల్పించకపోవడంపై మండిపడ్డారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం, శౌచాలయాలు లేవన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత లేదని, పుచ్చు కూరగాయలు తెచ్చి పిల్లలకు పెడుతున్నారని ఆరోపించారు. భోజనం నిర్వహణ సరిగా లేక సగానికి పైగా విద్యార్థులు ఇళ్ల నుంచే బాక్సులు, నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీలత, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సేవలు మరువలేనివి

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: దాతల సేవలు మరువలేనివని ఫ్యాక్స్ డైరెక్టర్ కమ్మరి కృపాచారి అన్నారు. మండల పరిధి నారాయణపూర్ పాఠశాల విద్యార్థులకు స్మార్ట్‌డాక్స్ బిజినెస్ సొల్యూషన్స్ వారు నీళ్ల బాటిల్స్, విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. సొల్యూషన్స్ హెచ్ఆర్ డైరెక్టర్ అనంద్‌బాల, మార్కెటింగ్ మేనేజరు శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తదితరులున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తూప్రాన్, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ పెద్ద చెరువులో మునిగి చనిపోయాడని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువులో మృతదేహాన్ని పురపాలిక సిబ్బంది, పోలీసుల సాయంతో బయటకు తీశారు. ఉమ్మడి చేగుంట మండలం చెట్ల తిమ్మాయపల్లికి చెందిన దాసుగా గుర్తించారు. చేపల వేటకు వెళ్లిన సమయంలో చెరువులో ఉన్న చేపల వలలో చిక్కుకొని మృతిచెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పంచనామ కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

భూ తగాదాల్లో ఒకరిపై కత్తితో దాడి

పాపన్నపేట: భూ తగాదాల్లో ఒకరిపై కత్తితో దాడి చేసిన ఘటన మండల పరిధి నామాపూర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముచ్చ చిన్న రామయ్య, లక్ష్మయ్య సోదరులు. గతంలో జరిగిన భూ పంపకాల్లో రామయ్య కొడుకు లింగమయ్య పేరిట సుమారు ఏడు గుంటల భూమి ఎక్కువగా నమోదైంది. దీంతో భూమిని తిరిగి ఇవ్వాలని లక్ష్మయ్య కొడుకు కుమార్ వారిని కోరారు. కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతుంది. ఈ విషయమై శనివారం పెద్దల సమక్షంలో గ్రామంలో పంచాయతీ జరిగింది. కుమార్ వేట కత్తితో సోదరుడైన లింగమయ్యపై దాడి చేయగా గొంతు వద్ద స్వల్ప గాయమైంది. వెంటనే గ్రామస్థులు అతడిని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుమార్ ఠాణాలో లొంగిపోయినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమే, ఫిర్యాదు అందాల్సి ఉందన్నారు.

మహిళ అదృశ్యం..

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. నర్సాపూర్ రజకుల కాలనీలో నివాసం ఉండే చాకలి లలిత(50) ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ నెల 16న కొడుకు, కోడలు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చారు. అప్పటికే తల్లి లలిత కనిపించ లేదు. వెంటనే చుట్టుపక్కల, పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించక లలిత కుటుంబ సభ్యులు శనివారం ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు.. ఇరువర్గాలపై కేసు

శివ్వంపేట, న్యూస్‌టుడే: కులం పేరుతో దూషించాడని వ్యక్తిపై, దాడి చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. దొంతికి చెందిన కోదాస్ పుల్లమ్మ ఈ నెల 16 రాత్రి తన ఇంటి ముందు గేదెను కట్టేయగా అక్కడే ఉన్న భిక్షపతి గేదె తన గేదెను పొడవగా దాని కన్ను పోయిందని, భిక్షపతి నష్టపరిహారం కట్టలేదన్నారు. పరిహారం ఇవ్వకుండా గ్రామానికి చెందిన మల్లవరం వెంకట్‌రెడ్డి అడ్డుపడి కులం పేరుతో దూషించి, కొట్టాడని పుల్లమ్మ ఫిర్యాదుతో కేసు అతనిపై నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పరిహారం కట్టాల్సిందేనని పుల్లమ్మ, ఆమె భర్త స్వామి తన ద్విచక్రవాహనాన్ని అడ్డుకుని దూషించి, కాళ్లతో తన్ని కొట్టారని వెంకట్‌రెడ్డి ఫిర్యాదుతో భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాతపుస్తకాలు, ప్లేట్లు పంపిణీ

మాసాయిపేట(చేగుంట), కౌడిపల్లి, న్యూస్‌టుడే: మాసాయిపేట మండలం పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు శనివారం రాత పుస్తకాలను అందజేశారు. మాజీ సర్పంచి మోహన్, హెచ్ఎం నవీన్, ఉపాధ్యాయులు శంకర్, జీఎంఆర్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులున్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే విట్టల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో ఆయన మనవడు నిరంజన్‌రెడ్డి, మనవరాలు విమల 300మంది విద్యార్థులకు సీడీసీ మాజీ ఛైర్మన్ దుర్గారెడ్డి చేతుల మీదుగా ప్లేట్లు అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తదితరులున్నారు.

బీమా చెక్కు అందజేత

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఇస్కపాయ తండాకు చెందిన సునావత్ నెహ్రూ మృతి చెందాడు. ఆయనకు భారాస సభ్యత్వం ఉంది. దీంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మృతుడి భార్య నాగమణికి అందించారు.

ఆర్థిక సాయం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: యశ్వంతరావుపేటలో విద్యుత్తు తీగ తగిలి మృతి చెందిన గుండెని యాదయ్య కుటుంబానికి స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు సాయం అందించారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి గజగట్లపల్లికి చెందిన వెంకటయ్య, భూలక్ష్మిలకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.39వేలు, రూ.18వేల చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు శేఖర్ శనివారం బాధితులకు అందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి

శివ్వంపేట: ఉసిరికపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు బాధితులకు ప్రభుత్వం వెంటనే రూ.5లక్షల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర సభ్యుడు నర్సింలు డిమాండ్ చేశారు. జగ్య తండా, భీమ్లా తండా, తాళ్లపల్లి తండాలో మృతుల కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు.

కంకర పరిచారు.. నిర్మాణం మరిచారు



మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతి పరిధి విఠల్ తండాకు మూడునెలల క్రితం తారురోడు వేసేందుకు కంకర పరిచారు. వర్షాలు కురవడంతో అలాగే వదిలేశారు. దీంతో అప్పటి నుంచి తండావాసులు నిత్యం కంకరపై రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు ఉన్నప్పుడే బాగుండేదన్నారు. బీటీ వేస్తారనుకుంటే కంకర పరిచి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ డీఈ రాధికా లక్ష్మిని వివరణ కోరగా.. త్వరలో పనులు పూర్తి చేసి, ప్రజల ఇబ్బందులు దూరం చేస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్:

దుకాణాలు అద్దెకిచ్చేదెప్పుడో?



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణాల సముదాయం నిరుపయోగంగా మారింది. చేగుంటలోని మెదక్ రోడ్డులో రూ.55లక్షలు వెచ్చించి ఏఎంసీ ఆధ్వర్యంలో 18 దుకాణాల నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల క్రితం నిర్మాణం పూర్తిచేశారు. వీటిలో కేవలం రెండు దుకాణాలను మాత్రమే అద్దెకు ఇచ్చారు. మిగతా వాటికి కూడా వేలం వేసినా వాటిని దుక్కించుకున్నవారు తీసుకోవడం లేదు. దీంతో 16 దుకాణాలు వృథాగా ఉన్నాయి. మూడేళ్ల నుంచి ఎలాంటి అద్దె రాకుండా వదిలేశారు. దీంతో లక్షల్లో ఏఎంసీ నష్టపోతుంది. అయినా పట్టించుకునే వారే కరవయ్యారు. వినియోగంలోకి తెస్తే అద్దె రూపంలో ఏఎంసీకి ఆదాయం వస్తుంది.

– న్యూస్‌టుడే, చేగుంట

ట్రాఫిక్ బాధలు తీరేదెన్నడో?



చేగుంటలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతోంది. ముఖ్యంగా గాంధీ చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. ఇటు హైదరాబాద్, అటు నిజామాబాద్, మరో వైపు మెదక్ నుంచి వాహనాలు వస్తుండడంతో చాలా సేపు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక రైలు గేటు తీసిన తర్వాత మెదక్ వైపు నుంచి వాహనాలు ఒకేసారి రావడంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చౌరస్తా వద్ద ఇరుకుగా ఉండి వాహనాలు ఆగిపోతున్నాయి. దీనికి తోడు భారీ వాహనాల రాకపోకలు చేగుంట నుంచే సాగిస్తున్నాయి. సమస్యపై పోలీసులు చర్యలు చేపట్టడం లేదు. - న్యూస్‌టుడే, చేగుంట

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, న్యూస్‌టుడే: కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి అనిత సూచించారు. నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అనిత పదోన్నతిపై సీనియర్ సివిల్ జడ్జిగా దేవరకొండకు బదిలీపై వెళుతున్నారు. ఈ సందర్భంగా ఆమెను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నర్సాపూర్‌లో న్యాయపరమైన సేవల్ని అందించడంలో ఎంతో సంతృప్తిని పొందానని అన్నారు. అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు అంజిరెడ్డి, ఎక్బాల్‌ఆలీ, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, ప్రకాష్, సత్యనారాయణ, ఆనంద్, సుధాకర్ తదితరులున్నారు.